# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 209 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 02 జులై 2026 | పేజీలు :4




విశిష్ట వైద్యుడు

- డాక్టర్ సుగుణాకర్ రాజుకు అరుదైన అవార్డు

3





# మహిళా సంఘాల్లో ఇష్టారాజ్యం..?

- గుట్టుచప్పుడు కాకుండా రూ.1.80 లక్షల చెక్కు విత్‌డ్రా!
- వీవోఏల వ్యవహారంపై మహిళల ఫిర్యాదులు
- చర్యలకు సిద్ధమైన అధికారులు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని మహిళా సంఘాల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో గ్రామైక్య సంఘాల్లో పనిచేస్తున్న కొందరు వివోఏలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ముత్తారం గ్రామైక్య సంఘం బ్యాంకు ఖాతా నుంచి అధికారుల అనుమతి లేకుండానే రూ.1.80 లక్షల విలువైన చెక్కును నగదుగా విత్‌డ్రా చేసిన ఘటన ఇటీవల బయటపడినట్లు సమాచారం. గ్రామైక్య సంఘం భవనం కోసం స్థలం కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఈ మొత్తాన్ని తీసుకున్నట్లు సంబంధిత వివోఏలు చెబుతున్నప్పటికీ, ఇందుకు అవసరమైన నిబంధనలు పాటించలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గ్రామైక్య సంఘం పరిధిలోని మహిళలు మండల అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. అధికారులు వివరణ కోరిన అనంతరం తీసుకున్న మొత్తాన్ని తిరిగి గ్రామైక్య సంఘం బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. అయితే డబ్బు తీసుకుని తిరిగి జమ చేయడంలో తప్పేమీ లేదని సంబంధిత వివోఏలు సమర్థించుకుంటున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇదే గ్రామైక్య సంఘం పరిధిలోని కొన్ని స్వయం సహాయక సంఘాల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ వసూళ్లు ఏ కారణంతో చేస్తున్నారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ భీమదేవరపల్లి మండలంలోని మహిళా సంఘాల



నిర్వహణపై పలు ఆరోపణలు వచ్చినప్పటికీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని సభ్యులు పేర్కొంటున్నారు. తాజా ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక గతంలాగే మందలింపులతోనే సరిపెడతారా? అన్న చర్చ మండలంలో సాగుతోంది.

## షోకాజ్ నోటీసులు జారీ చేశాం: ఏపీఎం వేణు

గ్రామైక్య సంఘం భవన నిర్మాణం కోసం భూమి కొనుగోలు చేసేందుకు గ్రామైక్య సంఘం తీర్మానం చేసిందని ఏపీఎం వేణు తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన నిధులు విత్‌డ్రా చేసిన విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు. విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే సంబంధిత వివోఏకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ నిర్వహించి డీఆర్డీఏ అధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆయన వెల్లడించారు.




2 లో

# విద్యతోనే మంచి భవిష్యత్ : కలెక్టర్




# విద్యతోనే మంచి భవిష్యత్

- విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను మెరుగుపరచాలి
- టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి
- మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, క్రీడా సదుపాయాలు, ప్రయోగశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని రఘునాథపల్లి మండలంలోని కేజీబీవీ పాఠశాలను, అలాగే ఖిలాషాపూర్ గల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. ఈ సందర్భంగా అన్ అకాడమీ తరగతులను ప్రారంభించి, విద్యార్థులకు గణితంకి సంబందించిన కొన్ని లెక్కలని కలెక్టర్ స్వయంగా సులభమైన పద్ధతి లో నేర్పించారు. విద్యార్థులు బాగా చదివి కేరిర్ లో బాగా సెటిల్ అవ్వాలని, తల్లిదండ్రులకి మంచి పేరు తేవాలన్నారు. విద్యతోనే జీవితం లో ఉన్నతమైన స్థానాలకు వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పిల్లలు బాగా చదివి మంచి ఉద్యోగంలో స్థిర పడినప్పుడే... తల్లి దండ్రులకు ఏ కష్టం లేకుండా చూసుకోవచ్చన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, వివిధ గదులను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తీసేస్తూ ఉండాలన్నారు. తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల పఠన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను ఎంతవరకు అర్థం చేసుకుంటున్నారో, చదివే నైపుణ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకుంటూ ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలను మెరుగుపరిచే దిశగా కృషి చేయాలని సూచించారు. అదే విధంగా ఈ అన్ అకాడమీ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, పాఠాలను శ్రద్ధగా వినాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను పర్యవేక్షించి, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని, ఆవరణను పూర్తిగా శుభ్రపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రమైన, సురక్షితమైన వంట విధానాలను పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్, గణిత శాస్త్ర ప్రయోగశాల, సైన్స్ ల్యాబ్ లను పరిశీలించారు. ప్రతి గది, ప్రతి విభాగం శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ పరిశోధనలలో సమానంగా రాణించే వాతావరణం కల్పించాలన్నారు.





# సమాజ హితమే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ జనగామ ఇంచార్జి బోడ సునీల్ మాదిగ



**జనగామ, మన చౌరాస్తా :** సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనగామ జిల్లా ఇన్‌చార్జి బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి, అనుబంధ విభాగాలతో జిల్లా స్థాయి సమావేశం ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి ఆ విజయ ఫలాలను మాదిగ, మాదిగ ఉపకులాలకు అందించి రేపటి తరాల భవిష్యత్తుకు చెరగని చరిత్రను నిర్మించిన ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామంలో ఎగరవేయాలన్నారు. జులై 7 ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక ఆర్థిక రాజకీయ అసమానతల లేని నూతన సమాజ నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన వర్గాలైన వికలాంగుల వృద్ధులు వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు సాధించినట్టు తెలిపారు. సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని అన్నారు. పోరాటాల ద్వారా సమాజానికి సంక్షేమ ఫలాలు అందించిన ఎమ్మార్పీఎస్ జెండాను ప్రతి గ్రామంలో ఎగరవేయడం కోసం ఎమ్మార్పీఎస్ శ్రేణులు కృషి చేయాలన్నారు.



# శివరాజ్ యాదవ్‌ను సన్మానించి బీజేపీ నేతలు

**జనగామ, మన చౌరాస్తా :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన శివరాజ్ యాదవ్‌ను ఆ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ కార్యవర్గంలో బీసీలకు ప్రముఖ స్థానం కల్పిస్తూ జనగామ ప్రాంతం నుంచి 30 సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన శివరాజ్ చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్త నుండి ఈ స్థాయి వరకు అవకాశం కల్పించడం రాష్ట్ర పార్టీకి జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరుట్ల దశమంత రెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, కొంతం శ్రీనివాస్తో పాటు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపారు. భారతీయ జనతా పార్టీ మరింత అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ సీనియర్ నాయకులు కొంతం శ్రీనివాస్, జిల్లా నాయకులు వారణాసి పవన్ శర్మ, పట్టణ అధ్యక్షులు బొమ్మకంటి అనిల్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు తోకల హరీష్, పెదోజు జగదీష్, సంపత్, బింగి రమేష్, గోధుమల అశోక్, మరపాక అనిల్, దుసరి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్‌కు సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** పవిత్ర పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియమితులైన డాక్టర్ లకావత్ లక్ష్మీ నారాయణ నాయక్‌ను బుధవారం పలువురు సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జనగామ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేముల మల్లేశ్ మహారాజ్, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాయ మల్లేశ్ కురుమ, పట్టణ నాయకులు చింతకింది మల్లేశ్, పిట్టల సతీస్ తదితరులు ఉన్నారు.




# పాలకుర్తి ఉన్నత పాఠశాలలో 'కిడ్డీ బ్యాంక్'

**పాలకుర్తి, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో చిన్నతనం నుంచే ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు అలవాట్లను పెంపొందించడమే లక్ష్యంగా పాలకుర్తి ఉన్నత పాఠశాలలో ఓ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా 'కిడ్డీ బ్యాంక్' సౌకర్యాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. హెచ్ఎం శోభారాణి మాట్లాడుతూ.. నేటి పిల్లలే రేపటి పౌరులని, చదువుతో పాటు వారికి జీవితంలో ఉపయోగపడే మంచి అలవాట్లను నేర్పించడం ఉపాధ్యాయులుగా తమ బాధ్యతన్నారు. ఈ కిడ్డీ బ్యాంక్ విద్యార్థులు జంక్ ఫుడ్, ఇతర అనవసర వస్తువులపై పెట్టే ఖర్చులను తగ్గించుకుని, తమకు వీలైనప్పుడు రోజుకు కేవలం 10 రూపాయల చొప్పున చేసుకోవచ్చని వివరించారు. ఉపాధ్యాయులు రమేష్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సుగుణాకర్ రాజుకి విశిష్ట వైద్యుడి అవార్డు

**జనగామ, మన చౌరాస్తా :**

భారతదేశంలోనే అత్యంత ప్రధానమైన ఇంగ్లీష్ సర్క్యులేషన్ కలిగిన ఇండియా టైమ్స్ నౌ 2026 సంవత్సరానికి అత్యుత్తమ విశిష్ట వైద్యుల అవార్డు కేటగిరీలో జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పగటిపాటి సురేష్ సుగుణాకర్ రాజుకి ప్రకటించింది. భారతదేశంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన వైద్యులలో (India's Top Most Inspiring Doctors 2026) ఒకరిగా మిమ్మల్ని సత్కరించడం మా అదృష్టంగా భావిస్తున్నామని అందులో పేర్కొంది. ప్రతిరోజూ వైద్యులు తమ జీవితాలను రోగులను నయం చేయడానికి, వారికి ధైర్యం చెప్పడానికి, ఆశను కల్పించడానికి అంకితం చేస్తుంటారు. వారి అచంచలమైన నిబద్ధత, సహనశక్తి, నిస్వార్థ సేవాభావం వారిని సమాజానికి నిజమైన ఆధార స్తంభాలుగా నిలబెడుతుంది. ఈ గుర్తింపు కేవలం



వృత్తిపరమైన ప్రతిభకు లభించిన గౌరవం మాత్రమే కాదు, ప్రతి రోగి జీవితాన్ని మెరుగుపరచాలనే మీ కరుణ, నిజాయితీ, అంకితభావానికి గుర్తింపు. ఈ పవిత్రమైన డాక్టర్స్ డే సందర్భంగా మీ అసాధారణ సేవలకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును అందిస్తున్నట్టు పేర్కొంది. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశంలో డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్‌ను స్మరించుకుంటూ జూలై 1న భారతదేశ అత్యంత ప్రధాన మైన ఇంగ్లీష్ డైలీ ఇండియా టైమ్స్ నౌ పత్రిక ప్రకటించిన అవార్డులలో తనను గుర్తించినందుకు పత్రిక యజమానికి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుతో తనను వైద్య వృత్తి పట్ల మరింత సేవా తత్వతలను బాధ్యతను గుర్తు చేసిందన్నారు. ఒక మారుమూల గ్రామం నుండి ఎదిగి ఎంతో అత్యంత విశిష్ట పురస్కారాన్ని అందుకోవడం పట్ల తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ అవార్డు రావడం పట్ల పలువురు డాక్టర్లు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు సుగుణాకర్ రాజును అభినందించారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**జనగామ, మన చౌరాస్తా :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) జనగామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. సమాజ సేవా దృక్పథంతో, అవసరమైన రోగులకు రక్తం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఐఎంఏ జనగామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ జె. బాలాజీ, కార్యదర్శి డాక్టర్ ఎ. శ్రీకాంత్ నాయకత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని జనగామ ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ సీనియర్ వైద్యులు డాక్టర్ డి. లవకుమార్ రెడ్డి, డాక్టర్ సిహెచ్ రాజమౌళి, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, డాక్టర్ కరుణాకర్ రాజు డియర్. దివ్య పాల్గొని తమ మద్దతు తెలిపారు.రక్తదాన శిబిరంలో డాక్టర్ జె. బాలాజీ, డాక్టర్ ఎ. శ్రీకాంత్, డాక్టర్ రంజిత్, డాక్టర్ స్వప్న రాథోడ్, డాక్టర్ రాజిని, డాక్టర్ విష్ణుశ్రీ, డాక్టర్ దివ్య, డాక్టర్ గోపిచంద్,




డాక్టర్ సృజన్‌తో పాటు పలువురు ఐఎంఏ సభ్య వైద్యులు రక్తదానం చేశారు.అదేవిధంగా ప్రముఖ సామాజిక సేవకులు కన్న పరశురాములు,ఆకృష్ణజీవన్ బజాజ్ పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. లయన్స్ క్లబ్ సూర్య సభ్యులు కూడా శిబిరంలో పాల్గొని సహకారం అందించారు.ఈ రక్తదాన శిబిరంలో 25 యూనిట్ల రక్తం సేకరించగా, వాటిని జనగామ ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధికి వితరణ చేశారు.ఈ సందర్భంగా ఐఎంఏ జనగామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ జె. బాలాజీ మాట్లాడుతూ, వైద్య సేవలతో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ప్రతి వైద్యుని కర్తవ్యమని పేర్కొన్నారు. సమాజానికి అవసరమైన సందర్భాల్లో ఐఎంఏ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వైద్యులు,స్వచ్ఛంద రక్తదాతలు, లయన్స్ క్లబ్ సభ్యులు మరియు ఇతర భాగస్వాములందరికీ ఐఎంఏ జనగామ అధ్యక్షుడు డా. బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ టూరిజం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# ఏఐటీయూసీ పోరాటం

- **చాడ వెంకటరెడ్డి**




**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలోని శిల్పారామం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటం కొనసాగుతుందని ఏఐటీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, గౌరవ అధ్యక్షుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ శిల్పారామం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం ఎంప్లాయిస్ యూనియన్ (కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజమౌళి అధ్యక్షతన ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చాడ వెంకటరెడ్డి, వి.ఎస్. బోస్ హాజరై ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ శిల్పారామంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని, భవిష్యత్తులో చేపట్టే పోరాటాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ శేర్లింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కే. చందు యాదవ్, కార్యదర్శి తుపాకుల రాములు, టి. కృష్ణ, కనకయ్య, విజయ్, జె. శ్రీను, ప్రవీణ్ కుమార్, సూర్యం, జగదాంబ, సభ్య బేగం తదితరులు పాల్గొన్నారు.



# సహకారం ద్వారానే శ్రేయస్సు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సహకార ఉత్సవాల్లో భాగంగా ములుకనూరు డెయిరీలో బుధవారం "సహకారం ద్వారానే శ్రేయస్సు" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సిద్ధాంతాలను ఆచరిస్తూ సహకార సంఘాల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న సంఘాలను బలోపేతం చేయడం, సహకార కార్యక్రమాల్లో సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా సహకార అధికారి (డీసీవో) బి. మోహన్ మాట్లాడుతూ, సహకార వ్యవస్థ దేశ అభివృద్ధికి వెన్నెముకలాంటిదని అన్నారు. సహకార సంఘాలు బలోపేతంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ప్రభుత్వ సౌకర్యాలపై పూర్తిగా ఆధారపడకుండా అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. సహకార శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. యాకుబ్ మాట్లాడుతూ, సహకార సంఘాలు ఆధునిక సాంకేతికతను, శిక్షణను అనుసంధానం చేసుకుంటే మరింత సమర్థవంతంగా పనిచేసి సభ్యులకు మెరుగైన సేవలు అందించగలవని వివరించారు. ములుకనూరు డెయిరీ జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, డెయిరీ ద్వారా సభ్యులు, వారి కుటుంబాలు, తద్వారా ప్రాంతం అభివృద్ధి చెందిన తీరును వివరించారు. ములుకనూరు డెయిరీ సహకార రంగంలో ఆదర్శ సంస్థగా నిలిచిందని పేర్కొన్నారు. డెయిరీ అధ్యక్షురాలు ధనశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీందర్, వివిధ సహకార సంఘాల అధ్యక్షులు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధి హామీ చట్టంలో మార్పులు

# ఉపసంహరించాలి

- **భీమదేవరపల్లిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వినతి**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని, వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని అమలు చేయకుండా రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం భీమదేవరపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్, విద్యుత్ సంస్కరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని గత విధానంలోనే కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని కోరారు. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల వాటా అనే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ముఖ ఆధారిత రెండు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలని, సంవత్సరానికి 125 రోజుల ఉపాధి కల్పించాలని, వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పనులను తగ్గించే నిబంధనను తొలగించాలని కోరారు. ప్రతి వారం వేతన స్లిప్పులు ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భీమదేవరపల్లి మండల కార్యదర్శి అజ్మీర బిక్షపతి, కమిటీ సభ్యులు కుమ్మరి సది, భూనాద్రి వెంకటస్వామి, స్వామి, పుతిలి అలేఖ్య, గంగా, జమున, స్వరూప, అరుణ, జక్కుల రవి, మల్లయ్య, సంపత్, కృష్ణమూర్తి, హనుమంతు, ఐలయ్య, సింది సత్తి తదితరులు పాల్గొన్నారు.

# wanted

## విలేకరులు కావలెను







**మన చౌరాస్తా** తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by UPPALANCHI POORNIMA on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : UPPALANCHI NARENDER. Ph : 8555800812, RNI : TGTEL/25/A4350